

అనర్హత ఉత్తర్వులు రద్దుచేయండి
డీసీఎంఎస్ చైర్మన్ వెంకట శేషగిరిరావుపై అనర్హత వేటు వేయగా.. ఆ ఉత్తర్వులను రద్దు చేయాలని ట్రిబ్యునల్ ఆదేశించింది. 10లో



ఎన్ఆర్ఐ సేవలు అభినందనీయం
ఎన్ఆర్ఐ ఫౌండేషన్ ఆధ్వర్యాన వివిధ వర్గాల వారికి చేస్తున్న సేవలు అభినందనీయమని కలెక్టర్ గౌతమ్ అన్నారు. 10లో

గరిష్టం / కనిష్టం
33° / 20°

వాతావరణం
జిల్లాలో ఆదివారం ఉదయం చలి వాతావరణమే ఉంటుంది. ఆతర్వాత మాత్రం ఉష్ణోగ్రతలు పెరుగుతాయి.

మంజూరు పనులు ఆపొద్దు..

- 'దిశ' సమావేశంలో ఎంపీ నామ నాగేశ్వరరావు
- రైల్వే శాఖాధికారుల తీరుపై ఆగ్రహం
- సమావేశానికి కలెక్టర్ రాకపోవడంతో అసహనం


మాట్లాడుతున్న ఎంపీ నామ నాగేశ్వరరావు, పక్కన జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్, అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్, అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్‌సింగ్

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో ఇప్పటి వరకు మంజూరైన పనులను ఆపకుండా యథావిధిగా కొనసాగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని దిశ కమిటీ చైర్మన్, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు ఆదేశించారు. అయితే, కొన్ని పనులను అధికారులు ఆపేస్తున్నట్లు తనకు సమాచారం అందిందని.. ఈ విషయంలో ఏమైనా ఆదేశాలు ఉన్నాయా అని ఆయన ప్రశ్నించారు. ఖమ్మంలోని డీపీఆర్‌సీ భవనంలో జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ(దిశ) సమావేశం చైర్మన్ అయిన ఎంపీ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ అడిగిన ప్రశ్నలకు అధికారులు పనులను ఆపాలని తమకెలాంటి ఆదేశాలు రాలేదని బదులిచ్చారు. అనంతరం శాఖల వారీగా పలు అంశాలపై సుదీర్ఘంగా సమీక్షించారు.

సమాచారం ఇవ్వడంలేదు..

రైల్వే అధికారులు అధికారిక కార్యక్రమాల సమాచారం తెలియచేయడం లేదని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ ప్రస్తావించారు. దీంతో ఎంపీ నామ మాట్లాడుతూ రైల్వే మంత్రులు క్షేత్రస్థాయిలో ఎంపీలదే కీలక పాత్ర అని చెబుతున్నా అధికారులు అలా వ్యవహరించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాక పనుల విషయంలో ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారం తీసుకుంటూ ఆతర్వాత సమాచారం ఇవ్వకపోవటం సరికాదని ఎమ్మెల్సీ తాతా మధు పేర్కొన్నారు. కాగా, వైరా సమీపాన జాతీయ రహదారి పనుల్లో జరిగిన ప్రమాదంపై అధికారులు స్పందిస్తూ కార్మికులకు వైద్యసేవలు అందించామని తెలిపారు. ఇక ఆర్‌యూబీల నిర్మాణంలో నాణ్యత లేదని, పలుచోట్ల నీళ్లు నిలుస్తున్నాయని జెడ్పీ చైర్మన్, చింతకాని, ఎర్రుపాలెం ఎంపీపీలు చెప్పగా.. సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో చర్చిస్తానని ఎంపీ తెలిపారు.

ఆతర్వాత 200 యూనిట్లలోపు విద్యుత్ ఉపయోగిస్తున్న వారికి ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్‌పై ప్రభుత్వం ఉత్తర్వులు రాలేదని అధికారులు వెల్లడించారు. అనంతరం ఎమ్మెల్సీ మధు మాట్లాడుతూ ఎర్రుపాలెం మండలం దెందుకూరులోని రైతుల భూములు సేకరించిన రైల్వే అధికారులు వారికి కనీస సౌకర్యాలు కల్పించటంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని పేర్కొన్నారు. ఇంకా గ్రానైట్ ఫ్యాక్టరీలు, రవాణా విషయంలో తనిఖీల అంశం కూడా ఈ సమావేశంలో చర్చకు వచ్చింది. ఈ సమావేశంలో కేఎంసీ మేయర్ పునుకొల్లు నీరజ, అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్‌సురభి, అసిస్టెంట్ కలెక్టర్ మాయంక్ సింగ్, డీఆర్‌డీఓ విద్యాచందన, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

కలెక్టర్ గైర్హాజరుపై...

కలెక్టర్ వీ.పీ.గౌతమ్ దిశ కమిటీ సమావేశానికి రాకపోవడంపై ఎంపీ నాగేశ్వరరావు అసహనం వ్యక్తం చేశారు. దిశ కమిటీ సమావేశం మధ్యాహ్నం 3గంటలకు నిర్వహించాలని ముందస్తుగానే నిర్ణయించగా, ఇతర సమావేశం ఉందని చెప్పారన్నారు. దీంతో 4గంటలకు మార్చి సాయంత్రం 4–30గంటల వరకు కూడా కలెక్టర్ హాజరుకాకపోవడం ఏమిటని ప్రశ్నించారు.

న్యూస్‌రీల్

శ్రీవారికి ప్రత్యేక పూజలు


ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని శ్రీవారి పాదంతో పాటు స్వామి మూల విరాట్‌కు వేదమంత్రోచ్ఛరణల నడుమ పంచామృతాలతో అభిషేకం చేశారు. ఆతర్వాత స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి నిత్యకల్యాణం జరిపించగా తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు చెందిన వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. అనంతరం పల్లకీ సేవ నిర్వహించారు. ఆలయ ఈఓ కె.జగన్మోహన్‌రావు, సూపరింటెండెంట్ కె.విజయకుమారి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సివిల్ సప్లయీస్ గోదాం తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న మేనేజర్ శ్రీలత

ఏన్కూరు: ఏన్కూరులోని పౌరసరఫరాల సంస్థ గోదాంను జిల్లా సివిల్ సప్లయీస్ మేనేజర్ శ్రీలత శనివారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులు, నిల్వలను పరిశీలించాక ఆమె మాట్లాడారు. గోదాంలోని బియ్యం నిల్వలు పాడవకుండా పర్యవేక్షిస్తూ, దిగుమతి, ఎగుమతుల్లో తేడా రాకుండా చూడాలని సూచించారు. ఉద్యోగులు శ్రీనివాసరావు, జి.నందారామ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు యుగంధర్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదివారం తలసేమియా బాధితుల సహాయార్థం మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. ఖమ్మం బైపాస్‌రోడ్డులో ఉన్న సప్తపది ఫంక్షన్ హాల్‌లో ఉదయం 9గంటలకు శిబిరం ప్రారంభమవుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈమేరకు కాంగ్రెస్ శ్రేణులు, తుమ్మల అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై తలసేమియా బాధితులకు అండగా నిలవాలని వారు కోరారు.

ఖమ్మంలో హైకోర్టు న్యాయమూర్తి

ఖమ్మం లీగల్: హైకోర్టు న్యాయమూర్తి భీమపాక నగేష్ శనివారం ఖమ్మం వచ్చారు. ఈసందర్భంగా ఆయనను న్యాయవాదులు పెమ్మసాని పట్టాభి, షేక్ లతీఫ్, రావి శివరామకృష్ణ, తోట రామాంజనేయులు తదితరులు కలిసి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.


న్యాయమూర్తికి పుష్పగుచ్ఛం ఇస్తున్న న్యాయవాదులు

ప్రతీ అవకాశాన్ని వినియోగించుకోండి

- తద్వారా ఉన్నతస్థాయికి చేరే అవకాశం
- మెగా జాబ్‌మేళాను ప్రారంభించిన కలెక్టర్ గౌతమ్
- 11వేల మందికి పైగా హాజరైన నిరుద్యోగులు



ఎంపికైన యువతికి నియామకపత్రం అందజేస్తున్న కలెక్టర్ గౌతమ్, పక్కన అధికారులు

ఖమ్మం స్పోర్ట్స్: నిరుద్యోగులందరూ ప్రభుత్వ ఉద్యోగాల కోసమే ఎదురుచూడకుండా అందివచ్చే ప్రతీ అవకాశాన్ని వినియోగించుకుంటే ఉన్నత స్థానానికి చేరుకోవచ్చని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ వెల్లడించారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో జాబ్ మేళా నిర్వహించామని తెలిపారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో శనివారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ జాబ్‌మేళాను ప్రారంభించిన కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగం వచ్చిన ప్రతీ అభ్యర్థి దూరం, దగ్గర అని చూడకుండా చేరాలని.. ఆపై ప్రయత్నాలు చేస్తుంటే మెరుగైన అవకాశాలు దరి చేరతాయని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కస్తాల సత్యనారాయణ, డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఉపాధి కల్పన శాఖాధికారి కొండపల్లి శ్రీరామ్, టీఎస్ఎస్ సెప్ మేనేజర్ జగన్నాథం, ధృవ కన్సల్టెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

వేల సంఖ్యలో అభ్యర్థులు

ఎస్సెస్సీ మొదలు ఆపై విద్యార్హతలు కలిగిన వారికి ఉద్యోగావకాశాలు ఉంటాయని గత వారం రోజులుగా ప్రచారం చేస్తుండడంతో రిజిస్ట్రేషన్ చేసుకున్న 11,530మందిలో దాదాపు అంతా హాజరయ్యారు. వీరి వెంట కుటుంబీకులు కూడా రావడంతో పటేల్ స్టేడియం కిక్కిరిసిపోయింది. ఈమేరకు 67 కంపెనీల బాధ్యులు పాల్గొని సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం 1,122 మందికి నియామక పత్రాలు అందజేశారు. అలాగే, మరో 2,698మందిని రెండో దశ ఇంటర్వ్యూలకు ఎంపిక చేశారు.

జీపీల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

వీసీలో మంత్రి ధనసరి సీతక్క

ఖమ్మంసహకారనగర్: గ్రామపంచాయతీల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ప్రత్యేక అధికారుల ద్వారా అమలు చేయనున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) తెలిపారు. ములుగు జిల్లా కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆమె కలెక్టర్లు, అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామపంచాయతీల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని.. ఇందుకోసం రూపొందించిన ప్రణాళికను ప్రత్యేక అధికారులు పక్కాగా అమలుచేయాలన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా పర్యవేక్షించడంతో పాటు అర్హులకు ఉపాధి హామీ పథకంతో చోటు కల్పించాలని, పారిశుద్ధ్య కార్యక్రమాలు సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా మాట్లాడుతూ ప్రత్యేక అధికారులకు ఒకరోజు శిక్షణ ఏర్పాటుచేయాలని తెలిపారు. జిల్లా నుంచి కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ ప్రతీ కుటుంబానికి మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందించడంతో పాటు ఇతర పనులపై ప్రత్యేకంగా పర్యవేక్షిస్తామని వెల్లడించారు. వీసీలో జెడ్పీ సీఈఓ వీ.వీ.అప్పారావు, డీపీఓ హరికిషన్, పీఆర్ ఎస్ఈ చంద్రమౌళీశ్వరరావు, ఏపీడీ శిరీష, భగీరథ ఈఈ పుష్పలత తదితరులు పాల్గొన్నారు.


వీసీలో పాల్గొన్న కలెక్టర్ గౌతమ్, అధికారులు

క్లుప్తంగా

అద్వానీకి 'భారతరత్న' ప్రకటనపై హర్షం



అద్వానీ చిత్రపటానికి నమస్కరిస్తున్న వైద్యులు

ఖమ్మం వైద్యవిభాగం: బీజేపీ సీనియర్ నేత ఎల్.కే.అద్వానీకి కేంద్రప్రభుత్వం భారతరత్న ప్రకటించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా శనివారం ఖమ్మంలో ఆయన చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లుతో పాటు అల్తాఫ్, మహేష్, రవితేజ, వినయ్, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి జావేద్‌పాషా

ఖమ్మం లీగల్: మెరుగైన సమాజం ఏర్పడేలా అందరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవా సంస్థ కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్ జావేద్ పాషా సూచించారు. అంతర్జాతీయ కేన్సర్ దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన శనివారం పారా లీగల్ వలంటీర్లు, న్యాయశాఖ ఉద్యోగులకు సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా న్యాయమూర్తి మాట్లాడాక, ప్రకృతి వైద్యశాస్త్ర నిపుణులు డాక్టర్ పి.కనకలక్ష్మి వ్యాయామం, మంచి ఆహార అలవాట్లపై అవగాహన కల్పించారు.

దాతలుచేయూతనిస్తేనే ఆరోగ్యం



చికిత్స పొందుతున్న రాధ

రఘునాథపాలెం: మండలంలోని బూడిదంపాడుకు చెందిన నిరుపేద మహిళ అనారోగ్యం బారిన పడగా చికిత్స కోసం చిల్లిగవ్వ లేక దాతల చేయూత కోసం ఎదురుచూస్తోంది. గ్రామానికి చెందిన గంగోలి సంపోను భార్య రాధ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతుండగా ఆస్పత్రుల్లో పరీక్ష చేయించారు. ఆమె లాప్కోలియా(పిత్తాశయంలో రాళ్లు) తో బాధపడుతుందని తేలగా చికిత్స కోసం రూ.లక్ష వరకు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. అయితే, కూలీ పనులకు వెళ్లి పొట్టపోసుకునే వారి చేతిలో చిల్లిగవ్వ లేక దాతల చేయూత కోరుతున్నారు. ఇప్పటికే గ్రామ యూత్ సభ్యులు వివిధ వాట్సప్ గ్రూపుల్లో రాధ వివరాలను షేర్ చేయగా కొందరు నగదు పంపించారు. అయితే, ఆర్థికసాయం చేయాలనుకునే దాతలు 77990 52625 నంబర్(గంగోలి రాకేష్) ద్వారా పంపించాలని రాధ దంపతులు కోరుతున్నారు.

రహదారులపై ఆక్రమణల కూల్చివేత

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని పలుచోట్ల రహదారులను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలపై కార్పొరేషన్ అధికారులు కొరఢా ఝులిపిస్తున్నారు. ఈమేరకు 2, 3వ డివిజన్ల పరిధిలోని పాండురంగాపురంలోని రోడ్లపై నిర్మించిన కట్టడాలను శనివారం జేసీబీ ద్వారా కూల్చివేయించారు. షెడ్లు, ఫెన్సింగ్‌లు, గేట్లను తొలగించిన అధికారులు ఎవరు రోడ్డును ఆక్రమించినా కూల్చివేతలు తప్పవని హెచ్చరించారు.

నేడు టీఎస్ యూటీఎఫ్ జిల్లాస్థాయి సమావేశం

ఖమ్మం సహకారనగర్: నేలకొండపల్లిలో ఆదివారం నిర్వహించనున్న టీఎస్ యూటీఎఫ్ జిల్లాస్థాయి విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీ.వీ.నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో కోరారు. ఈసమావేశానికి ముఖ్య అతిథులుగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, డీఈఓ సోమశేఖరశర్మ, యూనియన్ బాధ్యులు చావా రవి, సీ.హెచ్.దుర్గాభవాని, షేక్ మహబూబ్ అలీ తదితరులు హాజరవుతారని తెలిపారు. ఈమేరకు విద్యారంగం – ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించనున్నందున ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ప్రభుత్వ నర్సరీని ధ్వంసం చేసిన ముగ్గురిపై కేసు

కారేపల్లి: ప్రభుత్వ నర్సరీని ధ్వంసం చేసిన మాజీ సర్పంచ్ భూక్యా రమణతో పాటు మరో ఇద్దరిపై కారేపల్లి పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. మండలంలోని రేలకాయలపల్లి గ్రామపంచాయతీ పరిధి తవిసిబోడులో నాలుగేళ్ల క్రితం ఏర్పాటు చేసిన ప్రభుత్వ నర్సరీలోకి ఈనెల 1వ తేదీ రాత్రి రేలకాయలపల్లి మాజీ సర్పంచ్ భూక్యా రమణ, ఆయన కుటుంబ సభ్యులు భూక్యా సుధాకర్, భూక్యా శృతి అక్రమంగా ప్రవేశించి ఇది తమ స్థలమేనని, గతంలో ప్రభుత్వానికి ఇచ్చామంటూ నర్సరీ గేట్లు, మొక్కలను ధ్వంసం చేశారు. ఈ విషయాన్ని ఉద్యోగులు ఎంపీడీఓ చంద్రశేఖర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.రామారావు తెలిపారు.

ఉత్సాహం.. ఉద్వేగం

- జాబ్‌మేళాకు అనూహ్య స్పందన
- వేలాదిగా హాజరైన నిరుద్యోగ యువత
- కిక్కిరిసిపోయిన పటేల్ స్టేడియం

ఖమ్మం స్పోర్ట్స్: ప్రభుత్వ ఉద్యోగాల కోసం వేలాదిగా యువత ప్రయత్నాలు చేస్తుండగా... జిల్లా కేంద్రంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఇందులో 67కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని.. ఎస్సెస్సీ ఆపై విద్యార్హతలు కలిగిన యువతీయువకులు హాజరు కావొచ్చని అధికారులు కొన్నాళ్లుగా ప్రచారం చేస్తున్నారు. ఈమేరకు ఆన్‌లైన్‌లో పేర్ల నమోదుకు అవకాశం కల్పించగా 11,530మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో చాలా వరకు అభ్యర్థులు శనివారం ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించిన జాబ్‌మేళాకు హాజరుకాగా.. కిక్కిరిసిపోయింది. ఈమేరకు కంపెనీల ప్రతినిధులు అభ్యర్థులు దరఖాస్తులు, విద్యార్హత పత్రాలను పరిశీలించి ఇంటర్వ్యూల అనంతరం పలువురికి నియామక పత్రాలు అందజేయగా అప్పటివరకు ఉత్కంఠగా ఎదురుచూస్తున్న వారిలో సంతోషం వ్యక్తమైంది. మరికొందరిని రెండో దశ దశ ఇంటర్వ్యూలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జాబ్‌మేళాకు హాజరైన కొందరు అభ్యర్థులు, నిర్వహణలో పాలుపంచుకున్న అధికారుల అభిప్రాయాలు ఇలా ఉన్నాయి.



కంపెనీల వివరాలు పరిశీలిస్తున్న యువత



అభ్యర్థుల దరఖాస్తులు పరిశీలిస్తున్న కంపెనీల ప్రతినిధులు

అక్కడికక్కడే ఆర్డర్లు



కంపెనీల ప్రతినిధులకు వేర్వేరు స్టాళ్లు కేటాయించి ఇంటర్వ్యూలకు ఏర్పాట్లు చేశాం. అభ్యర్థులకు అవగాహన కల్పించేలా వలంటీర్లు సహకరించారు. ఎంపికైన వారికి అక్కడిక్కడే కంపెనీల ప్రతినిధుల అపాయింట్‌మెంట్ అర్డర్లు ఇచ్చారు.

– కొండపల్లి శ్రీరాం, జిల్లా ఉపాధి కల్పన శాఖాధికారి

అమ్మానాన్నకు అండగా ఉండొచ్చని...



గతంలో ఎక్కడ జాబ్‌మేళాలకు కానీ కంపెనీల్లో ఇంటర్వ్యూలకు వెళ్లలేదు. ఇప్పుడే మొదటిసారి హాజరయ్యారు. ఇప్పటికే పీజీ పూర్తిచేసి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాను. ఉద్యోగం సాధిస్తే అమ్మానాన్నకు కాస్తయినా అండగా నిలవొచ్చని వచ్చాను.

– గోవర్ధనగిరి లక్ష్మీప్రసన్న, ఖమ్మం

నమ్మకంతో వచ్చాను...



ఇప్పటికే ఓ కంపెనీలో జాబ్ చేస్తున్నా. మరింత మెరుగైన అవకాశం దక్కుతుందని ఇక్కడకు వచ్చా. మంచి జాబ్ సాధిస్తే మా ఇంట్లో వారిని సంతోషపెట్టొచ్చు. అయితే, మేళాకు ఇంతమంది వస్తారనుకోలేదు. అన్ని ఉద్యోగాలకు పోటీ ఉంది.

– సాయికార్తీక్, ఖమ్మం

అపాయింట్‌మెంట్ అర్డర్ అందుకున్నా..



ఫార్మసీ కంపెనీలో జాబ్ వచ్చింది. మొదటి ఇంటర్వ్యూలోనే డిగ్రీ అర్హతతో ఉద్యోగం సాధించడం సంతోషంగా ఉంది. ఈ విషయం తెలిస్తే మా అమ్మనాన్న సంతోషిస్తారు. ఇంటర్వ్యూలో అడిగిన ప్రశ్నలకు మెరుగైన సమాధానాలు ఇచ్చా.

– భూక్యా కళ్యాణ్, కారేపల్లి

ఇలా ఉంటుందనుకోలేదు..



జాబ్ మేళాకు ఇంతమంది వస్తారని అనుకోలేదు. మాది పేద కుటుంబం కావడంతో ఎలాగైనా ఉద్యోగం సాధించాలనే తపనతో వచ్చాను. రెండు, మూడు కంపెనీల ఇంటర్వ్యూలకు హాజరయ్యా. త్వరలోనే ఫలితం వెల్లడిస్తామని చెప్పారు.

– టి.కిరణ్, కొణిజర్ల

జాబ్ చేయాలని ఉంది



ఎమ్మెస్సీ కెమిస్ట్రీ పూర్తి చేసిన నాకు ఉద్యోగం అవసరం. ఫార్మా రంగంలో జాబ్‌పై ఆసక్తితో ఇక్కడ మేళాకు వచ్చాను. రెండు, మూడు కంపెనీల ఇంటర్వ్యూలకు హాజరైన నాకు ఎంపికవుతాననే నమ్మకముంది. మంచి కంపెనీ ఎంచుకుంటా.

– బొల్లం శ్రావణి, కల్లూరు

అనూహ్యమైన స్పందన...



జాబ్ మేళాకు మంచి స్పందన వచ్చింది. ఆన్‌లైన్ ద్వారా 11వేల మందికి పైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఇంటర్వ్యూలు పూర్తయ్యేవరకు సాయంత్రం పొద్దుపోయే అవకాశముంది. అయినా ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశాం.

– టి.సునీల్‌కుమార్‌రెడ్డి, డీవైఎస్‌ఓ

మాతృభాషను మరవొద్దు

'హార్వెస్ట్' వార్షికోత్సవంలో మంత్రి తుమ్మల

ఖమ్మం సహకారనగర్: తల్లిదండ్రులు పిల్లలకు ఇతర భాషలతో పాటు మాతృభాష అయిన తెలుగు నేర్పించడాన్ని మరవొద్దని రాష్ట్ర వ్యవసాయ, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ఖమ్మంలోని హార్వెస్ట్ విద్యాసంస్థల 22వ వార్షికోత్సవం శనివారం నిర్వహించగా.. మంత్రి ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో పోటీతత్వం, మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యావిధానంలో మార్పులు వస్తున్నాయని తెలిపారు. ఈ క్రమంలో ఎప్పటికప్పుడు కొత్త విధానాలు అందుబాటులోకి తీసుకురావడంలో హార్వెస్ట్ ముందంజలో ఉండటం అభినందనీయమన్నారు. అనంతరం హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్ మాట్లాడుతూ హార్వెస్ట్ స్కూల్, టెండర్ రూట్ స్కూల్, హార్వెస్ట్ స్ప్రింగ్‌లీఫ్ ద్వారా ఇప్పటికే విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తుండగా.. వచ్చే ఏడాది నుంచి మరింత ఆధునిక విధానాలతో సెడార్ వ్యాలీ స్కూల్ ప్రారంభించనున్నామని తెలిపారు. ఆతర్వాత ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి మాట్లాడగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈకార్యక్రమంలో హార్వెస్ట్ విద్యాసంస్థల ఉపాధ్యాయులు, ఉద్యోగులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



వార్షికోత్సవాన్ని ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి



నృత్యం చేస్తున్న విద్యార్థులు

జేవీవీ ఆధ్వర్యాన జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్

ఖమ్మం సహకారనగర్: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యాన ఖమ్మంలోని రిక్కాబజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం జిల్లా స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా సైన్స్ అధికారి జగదీష్, పాఠశాల హెచ్‌ఎం శాంతికుమారి ప్రశ్నాపత్రాలను ఆవిష్కరించగా, జేవీవీ గౌరవ అధ్యక్షుడు మల్లెంపాటి వీరభద్రం మాట్లాడారు. విద్యార్థుల్లోశాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈమేరకు విజేతలకు బహుమతులు అందచేయగా, వీరు ఈనెల 9నుంచి జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నాను. ఈకార్యక్రమంలో జేవీవీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి.శివన్నారాయణ, కె.రామారావుతో పాటు మోహన్, ఎల్.వీ.రెడ్డి, శ్రీరాములు, తాతా రాఘవయ్య, పొత్తూరి సీతారామారావు, టి.రామకష్ణ, శర్మ, బి.రామకష్ణ, దొండపాటి రమేష్, భాస్కర్‌రెడ్డి, గురవమ్మ, వెంకటేశ్వర్లు, ప్రవీణ్, కనకయ్య, నాగేశ్వరరావు, ఉపేంద్ర, నామా పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ ఆధ్వర్యాన 'పోలీస్ శాలరీ ప్యాకేజీ'



ప్యాకేజీ పత్రాలతో సీపీ సునీల్‌దత్, ఎస్‌బీఐ ఆర్‌ఎం విజయ్‌కుమార్ తదితరులు

ఖమ్మంగాంధీచౌక్: ఎస్‌బీఐ నూతనంగా రూపొందించిన పోలీస్ శాలరీ ప్యాకేజీ ఒప్పంద పత్రాన్ని శనివారం ఆవిష్కరించారు. ఈ పత్రాలను సీపీ సునీల్ దత్, ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ విజయ్‌కుమార్ విడుదల చేయగా.. ఆర్‌ఎం మాట్లాడారు. ఎస్‌బీఐలో ఖాతా కలిగిన పోలీసు ఉద్యోగులకు మెరుగైన బీమా, ఇతర ప్రయోజనాలు కల్పించేలా ఈ ప్యాకేజీని అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. అనంతరం ఎస్‌బీఐ సీఎస్‌ఆర్ సొసైటీ ద్వారా పలువురికి కుట్టు మిషన్లు అందించారు. అడిషనల్ డీసీపీ కేఆర్‌కే.ప్రసాదరావు, ఎస్‌బీఐ జూబ్లీపుర చీఫ్ మేనేజర్ నారాయణమూర్తి, అధికారులు శంకర్‌రావు, కె.రవీందర్, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు కేసుల్లో ఇద్దరు రౌడీషీటర్లు సహా ఏడుగురి అరెస్ట్

ఖమ్మంక్రైం: పోలీసు కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సునీల్‌దత్ ఆదేశాల మేరకు రౌడీషీటర్లపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఈనేపథ్యాన దాడులు, దౌర్జన్యాలకు దిగుతున్న ఇద్దరు రౌడీషీటర్లతో పాటు ఐదుగురు అనుచరులను శనివారం అరెస్ట్ చేశారు. ఖమ్మం ఎన్నెస్పీ క్యాంప్‌లో నివాసముంటున్న ఆవుల అశోక్, ఆయన అనుచరులు భద్రాద్రి జిల్లా ములకలపల్లి మండలం మూకమామిడికి చెందిన గొడ్డేటి అశోక్, నేలకొండపల్లి మండలం కోరట్లగూడెంకు చెందిన ఒప్పలకూర పుల్లయ్య, కొణిజర్ల మండలం తీగల బంజరకు చెందిన నూనావత్ శ్రీను, తిరుమలాయపాలెం మండలం బచ్చోడుకు తిమ్మడి హన్మంతరావు, కొణిజర్ల మండలం రామన్నయ్యనగర్‌కు చెందిన గడ్డం లక్ష్మణ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఖమ్మం టూటౌన్ పోలీసులు తెలిపారు. అలాగే, జెడ్పీ సెంటర్‌లోని ఓ సంస్థ బాధ్యుల నుంచి రూ.6లక్షల తీసుకుని తిరిగి అడిగితే చంపుతానని బెదిరిస్తున్న రౌడీషీటర్ పేరల్లి ప్రవీణ్‌కుమార్‌ను అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. ఆయనపై గతంలోనూ ఖమ్మం, నల్లగొండ జిల్లాలో కేసులు ఉండగా.. జైలుకు వెళ్లి వచ్చాక తిరిగి నేరాలకు పాల్పడుతుండడంతో అరెస్ట్ చేశామని వెల్లడించారు.

పదవీకాలం పూర్తయ్యాక చెక్‌పవర్!

వేంసూరు: నాలుగేళ్ల క్రితం అన్యాయంగా చెక్‌పవర్ తొలగించిన అధికారులు పదవీకాలం పూర్తయ్యాక పునరుద్ధరిస్తూ పోస్టు ద్వారా ఆదేశాలు పంపారని మండలంలోని వెంకటపురం ఉప సర్పంచ్ యర్రసాని కృష్ణకుమారి తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆమె మాట్లాడుతూ చేయని పనులకు సిద్ధం చేసిన చెక్కులపై సంతకం చేయాలని కోరితే నిరాకరించడంతో 2020 జూలైలో చెక్ పవర్ రద్దు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, తన తప్పేమీ లేదని తేలగా గత నెల30 తేదీన చెక్‌పవర్ మంజూరు చేస్తూ అధికారుల పంపిన ఆదేశాలు పదవీకాలం ముగిశాక శనివారం అందాయని తెలిపారు. ఏదిఏమైనా తన న్యాయ పోరాటం ఫలించిందని పేర్కొన్న... అప్పట్లో తనపై చర్యలు తీసుకున్న వారిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో బండి సునీత, కోంద్రు కృష్ణారావు గంద్ర పుష్పవతి, జంగ శ్రీనివాసరెడ్డి, పి.సోమిరెడ్డి, చిలుకూరి సత్యనారాయణ, వెదుళ్ల శ్రీనివాసరావు, ఎస్.నాగుల్‌మీరా పాల్గొన్నారు.

13 ఆలయాల ధర్మకర్తల మండళ్లకు నోటిఫికేషన్

ఖమ్మంగాంధీచౌక్: జిల్లాలోని 13 దేవాలయాలకు ధర్మకర్తల మండళ్ల ఏర్పాటు కోసం రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ శనివారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఖమ్మం చెరువుబజార్‌లోని శ్రీదాసాంజనేయ స్వామి దేవస్థానం, లకారం చెరువు వద్ద ఉన్న శ్రీ పవనసుత జలాంజనేయ స్వామి దేవస్థానం, కమాన్ బజార్ రైల్వేగేట్‌లోని శ్రీ హనుమాన్ టెంపుల్, చింతకాని మండలం నాగులవంచలోని శ్రీ గజగిరి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం, నేలకొండపల్లిలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం, శ్రీ రాజగోపాల స్వామి దేవస్థానం, ఎర్రుపాలెంలోని శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానం, మధిర మండలం సిరిపురంలోని శ్రీ నరేంద్ర స్వామి దేవస్థానం, కొణిజర్ల మండలం తనికెళ్లలోని శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానం, ఏన్కూరు మండలం నాచారంలోని శ్రీ అద్భుత వెంకటేశ్వర స్వామి దేవస్థానం, ముదిగొండ మండలం ముత్తారంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం, వైరా మండలం స్నానాల లక్ష్మీపురంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం, వైరాలోని శ్రీ కోదండ రామ స్వామి దేవస్థానం ఈ జాబితాలో ఉన్నాయి. వంశ పారంపర్య ధర్మకర్తల మండళ్ల నియామకానికి అర్హులైన వారు ఇరవై రోజుల్లో ఖమ్మం దేవాదాయ, ధర్మాదాయ సహాయ కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

ద్విచక్ర వాహనం ఢీకొని మహిళ మృతి

సత్తుపల్లిటౌన్: ఇంటి ముందు నిల్చుని ఉన్న మహిళను ద్విచక్రవాహనం ఢీకొనడంతో అక్కడక్కడే మృతి చెందిన ఘటన సత్తుపల్లిలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. పట్టణంలోని తుమ్మూరు రామారావు వీధికి చెందిన కందుల లక్ష్మీదేవి(70) ఇంటి ముందు నిల్చొని ఉండగా అదే వీధికి చెందిన ఆటో మెకానిక్ ద్విచక్రవాహనంపై అతివేగంగా హైవే మీదకు వెళ్తూ ఢీకొట్టాడు. దీంతో ఎగిరిపడిన లక్ష్మీదేవి తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఆమెకు ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. కాగా, ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చోరీ కేసుల్లో నిందితుడి రిమాండ్

ఎర్రుపాలెం : మండలంలోని బనిగండ్లపాడులోని శ్రీదుర్గామల్లేశ్వరస్వామి, శ్రీఅంకమ్మ తల్లి, పేరంటాల తల్లి అమ్మవారి ఆలయాలే కాక రాజులదేవరపాడులోని శ్రీఆంజనేయస్వామి వారి ఆలయంలో చోరీకి పాల్పడ్డ వ్యక్తిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు.ఎస్ఐ ఎం.సురేష్ ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.... గత నెల 12న మూడు ఆలయాల్లోని హుండీలను మధిరకు చెందిన కోట ఆనందరావు, మాడగోని నాగతిరుపతిబాబు, గద్దల వినయ్ పగలగొట్టి నగదు చోరీ చేశారు. ఈమేరకు కోట ఆనందరావు పట్టుబడగా శనివారం మధిర కోర్టుకు హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. కాగా, పరారీలో ఉన్న మరో ఇద్దరు నిందితుల కోసం గాలిస్తున్నట్లు పేర్కొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

తిరుమలాయపాలెం: మండలంలోని మాదిరిపురం వద్ద గంజాయి స్వాధీనం చేసుకున్న ఘటనకు సంబంధించి వివరాలను ఖమ్మం రూరల్ ఏసీపీ బస్వారెడ్డి శనివారం వెల్లడించారు. తిరుమలాయపాలెం పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ మహారాష్ట్రకు చెందిన విష్ణువితల్‌రావు మట్పే, సచిన్‌కాంత థోమ్రేతో పాటు ఒడిశాకు చెందిన రాజు రూ.3.5లక్షల విలువైన 14 కేజీల గంజాయి తరలిస్తుండగా మాదిరిపురం వద్ద పట్టుబడ్డారని తెలిపారు. వీరిలో రాజు పరారవడంతో మిగిలిన ఇద్దరిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు. కాగా, గంజాయి రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక బృందాలతో తనిఖీలు చేస్తున్నామని ఏసీపీ తెలిపారు. ఈసమావేశంలో కూసుమంచి సీఐ జితేందర్‌రెడ్డి ఎస్ఐ వరాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్యాయత్నం

కామేపల్లి: పంటల దిగుబడి సరిగ్గా లేకపోవడంతో ఓ రైతు పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మండలంలోని కొమ్మినేపల్లి గ్రామ పంచాయతీ పరిధి అబ్బాసుపురానికి చెందిన ధరావత్ నెహ్రూ సాగుచేసిన పంటల దిగుబడి సరిగ్గా రాక అప్పులు ఎలా తీర్చాలని ఆవేదన చెందాడు. ఈమేరకు శనివారం చేను వద్ద పురుగుల మందు తాగగా, కాసేపటికి గమనించిన రైతులు 108కు సమాచారం ఇవ్వగా ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పదో తరగతి విద్యార్థుల మార్కులు పరిశీలన

నేలకొండపల్లి: పదో తరగతి విద్యార్థులకు ఫార్మెటివ్ అసెస్‌మెంట్‌లో కేటాయించిన మార్కులను జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి కె.రవికుమార్ శనివారం తనిఖీ చేశారు. మండలంలోని చెరువుమాధారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆయన ఆయన విద్యార్థుల మార్కులను పరిశీలించి మాట్లాడారు. వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత నమోదయ్యేలా విద్యార్థులను సిద్ధం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. జిల్లా పరీక్షల విభాగం కార్యదర్శి నారాయణతోపాటు రమేష్, రత్నకుమారి, సుంకరమోని నాగార్జున, అరవింద్‌కుమార్, రత్నంరాజు, మంగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

చెత్త వాహనాలను రానివ్వం



బీసీ కాలనీలో నిలిచిపోయిన వాహనాలు

ఖమ్మంమయూరిసెంటర్:నగరంలో సేకరించిన వ్యర్థాలను తీసుకొచ్చే వాహనాలు తమ కాలనీ మీదుగా వెళ్లవద్దంటూ బీసీ కాలనీ వాసులు శనివారం అడ్డుకున్నారు. వ్యర్థాల లోడ్‌తో వెళ్లే వాహనాలు కాకుండా ఖాళీ వాహనాలను మాత్రమే అనుమతిస్తామని స్పష్టం చేశారు. వ్యర్థాలను తీసుకెళ్లే వాహనాలు వెళ్తుండడంతో దుర్వాసన కారణంగా ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. ఈమేరకు పెద్దసంఖ్యలో వ ఆహనాలు నిలిచిపోగా, కేఎంసీ అధికారులు చేరుకుని మరోమార్గంలో వాహనాలు పంపిస్తామని నచ్చచెప్పడంతో శాంతించారు.

పది క్వింటాళ్ల మిర్చి చోరీ

తల్లాడ: తల్లాడ మండలం లక్ష్మీనగర్ వద్ద శుక్రవారం రాత్రి ఓ రైతు కల్లంలో ఆరబోసిన మిర్చిని గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. మండలంలోని మల్లవరానికి చెందిన దాసరి శ్రీనివాసరావుకు లక్ష్మీనగర్ వద్ద మూడున్నరెకరాలు కౌలుకు తీసుకొని మిరప సాగు చే శాడు. గత రెండు రోజుల నుంచి కోస్తు న్న కాయలను కల్లంలోనే ఆరబోయగా, శనివారం ఉదయం వచ్చేసరికి పది క్వింటాళ్ల మిరప కాయలు చోరీ అయినట్లు గుర్తించాడు. దీంతో రైతు ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనాస్థలిని పరిశీలించారు.

చిన్నారితో వృద్ధుడి అసభ్య ప్రవర్తన

వైరారూరల్: అభంశుభం తెలియని చిన్నారి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వృద్ధుడిపై వైరా పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. వైరా మండలంలోని ఓ గ్రామానికి చెందిన అరవై ఏళ్ల వృద్ధుడు చెరుకూరి లాలయ్య శుక్రవారం సాయంత్రం వీధిలో ఆడుకుంటున్న ఆరేళ్ల చిన్నారిని దగ్గరకు పిలిచి అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ విషయాన్ని ఆమె తన తండ్రికి తెలపగా.. పోలీసులను ఆశ్రయించడంతో విచారణ అనంతరం లాలయ్యపై పోక్సో కేసు నమోదు చేశారు.

హైటెక్ మోసాల ఆటకట్టు

సైబర్ నిందితుడి వద్ద నేరాలపై శిక్షణ

- ఆపై సొంతంగా నకిలీ కాల్ సెంటర్ ఏర్పాటు
- డేటా ఎంట్రీ జాబ్స్ అంటూ నిరుద్యోగులకు వల
- తెలంగాణ సహా 25 రాష్ట్రాలలో మోసాలు
- రూ.100 కోట్లకు పైగా సొమ్ము వసూలు చేసిన ముఠా
- నలుగురు అంతర్రాష్ట్ర సైబర్ నిందితుల అరెస్టు


పోలీసుల అదుపులో నిందితులు

సాక్షి, హైదరాబాద్: సైబర్ నిందితుడి వద్ద శిక్షణ తీసుకొని, ఆపై సొంతంగా నకిలీ కాల్ సెంటర్ ఏర్పాటు చేసి తెలంగాణ సహా దేశవ్యాప్తంగా మోసాలకు పాల్పడుతున్న మోస్ట్ వాంటెడ్ సైబర్ ముఠా గుట్టురట్టయింది. డేటా ఎంట్రీ జాబ్స్ పేరిట నిరుద్యోగులకు వల వేసి.. ఆపై కంపెనీ షరతులను ఉల్లంఘించారని పేర్కొంటూ నకిలీ లీగల్ నోటీసులు పంపించి బాధితుల నుంచి సొమ్ము వసూలు చేసిందీ గ్యాంగ్. తెలంగాణ, రాజస్థాన్, ఉత్తర్ ప్రదేశ్, హరియాణా, ఢిల్లీ, మహారాష్ట్ర వంటి 25కుపైగా రాష్ట్రాలలో 358 సైబర్ కేసులున్న ఈ ముఠా.. ఇప్పటివరకు సుమారు రూ.100 కోట్లకు పైగానే సొమ్ము వసూలు చేసినట్లు సైబరాబాద్ సైబర్ క్రైం డీసీపీ శిల్పవల్లి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి..

టెలీ కాలర్‌గా పని చేసి..

గుజరాత్‌లోని సూరత్‌లో నకిలీ డేటా ఎంట్రీ కంపెనీలో దిండోలి ప్రాంతానికి చెందిన రాహుల్ అశోక్ భాయ్ భాస్కర్ టెలీ కాలర్‌గా పని చేశాడు. ఓ సైబర్ క్రైమ్ కేసు దర్యాప్తులో భాగంగా స్థానిక పోలీసులు కంపెనీ యజమాని నితీష్‌ను అరెస్టు చేసి, కాల్ సెంటర్‌ను మూసేశారు. కాల్ సెంటర్, డేటా ఎంట్రీ కార్యకలాపాలపై పట్టు సాధించిన రాహుల్.. తన స్నేహితులైన సాగర్ పాటిల్, కల్పేష్ థోరట్, నీలేష్ పాటిల్‌లను సంప్రదించి సైబర్ మోసాల గురించి వివరించాడు. ఈ నలుగురూ కలిసి సూరత్‌లో ఫ్లోరా సొల్యూషన్ పేరుతో నకిలీ కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్ పోర్టల్స్ నుంచి నిరుద్యోగుల డేటాను సేకరించి, వారికి వాట్సాప్ ద్వారా డేటా ఎంట్రీ జాబ్ సందేశాలను పంపించేవారు. ఆసక్తి కనబరిచిన వారికి జాబ్ లాగిన్ కోసం ఐడీ, పాస్‌వర్డ్ అందించేవారు.



నకిలీ లీగల్ నోటీసులతో బెదిరింపులు..

డేటా ఎంట్రీ పని పూర్తయ్యాక ఉద్యోగికి సొమ్ము చెల్లించకుండా కంపెనీ ప్రమాణాలకు తగిన స్థాయిలో డేటా ఎంట్రీ లేదని మాయమాటలు చెబుతూ సొమ్ము చెల్లించరు. దీంతో కొంతకాలం ఎదురుచూసిన ఉద్యోగికి డేటా ఎంట్రీ చేయడం మానేస్తాడు. అప్పుడే నిందితులు రంగంలోకి దిగుతారు. కంపెనీ నిబంధనలు, షరతులను ఉల్లంఘించారని పేర్కొంటూ నకిలీ లీగర్ నోటీసులను బాధితులకు వాట్సాప్, ఈ-మెయిల్ ద్వారా పంపించి బెదిరింపులకు తెగిస్తారు. నోటీసులు రద్దు చేసుకోవాలంటే చార్జీలను చెల్లించాల్సి ఉంటుందని చెబుతారు. ఈక్రమంలో సైబరాబాద్‌కు చెందిన ఓ బాధితుడు వీరి వలలో చిక్కి రూ.6.17 లక్షలు మోసపోయాడు. ఇప్పటికే ఈ ముఠాపై సైబరాబాద్‌లో 11 కేసులున్నాయి.

వేలాది బ్యాంకు ఖాతాల విశ్లేషణ..

బాధితులు పంపించిన సొమ్ము ఏ బ్యాంకు ఖాతాలు నుంచి ఎక్కడికి బదిలీ అయ్యాయో విశ్లేషించారు. ఇతరత్రా సాంకేతిక అంశాల ఆధారంగా నిందితులు రాహుల్, సాగర్, కల్పేష్, నీలేష్‌లు సూరత్‌లో ఉన్నట్లు గుర్తించారు. రంగంలోకి దిగిన ప్రత్యేక బృందం వారిని అరెస్టు చేసి, స్థానిక న్యాయస్థానంలో హాజరుపరిచారు. ట్రాన్సిట్ వారంట్ నగరానికి తీసుకొచ్చి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. వీరి నుంచి ఆరు ఫోన్లు, ల్యాప్‌టాప్, 5 డెబిట్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల నుంచి మరింత సమాచారం రాబట్టేందుకు సోమవారం కస్టడీకి పిటీషన్ దాఖలు చేయనున్నట్లు డీసీపీ తెలిపారు.

డ్రగ్స్ ముఠా అరెస్ట్

గచ్చిబౌలి: ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో డ్రగ్స్ విక్రేతలను అరెస్టు చేశారు. గచ్చిబౌలి సీఐ జేమ్స్ బాబు తెలిపిన ప్రకారం..యూసూఫ్‌గూడకు చెందిన సులేమాన్ అబుబాకర్ అలియాస్ వాసీమ్, హుమాయున్‌నగర్‌కు చెందిన షేక్ అర్మన్, బంజారాహిల్స్‌కు చెందిన అర్కమ్ హుస్సేన్ రెండేళ్లుగా బెంగళూర్, గోవా నుంచి డ్రగ్ తీసుకొచ్చి పబ్‌లలో విక్రయిస్తున్నారు. నోవాటెల్ అర్బిస్ట్రీ, ఎయిర్ లైవ్ పబ్, క్లబ్‌రాక్‌లో కొకైన్ గ్రాము రూ.15 వేలు, గ్రాము ఎండీఎంఏ రూ.8 వేలకు విక్రయించారు. ఈ క్రమంలో క్లబ్‌లో నిజాంపేట్‌లో నివాసం ఉండే మిథున్ అనే మహిళతో సులేమాన్‌కు పరిచయం ఏర్పడింది. ఇద్దరి మధ్య స్నేహం ఏర్పడటంతో డ్రగ్‌ను ఆమెకు ఉచితంగా ఇచ్చేవాడు. ఆమెతో పాటు వారి స్నేహితులకు డ్రగ్ విక్రయించేవారు. ఈ క్రమంలో విభేదాలు రావడంతో సులేమాన్ మిథున్‌ను వేధించడం మొదలుపెట్టాడు. ఓ వైపు ఆరోగ్యం క్షీణించడం, మరోవైపు వేధింపులు తట్టుకోలేక ఆమె బాచుపల్లి షీ టీంను ఆశ్రయించింది. వారి సూచనలతో టీఎస్ న్యాబ్ సిబ్బందిని ఆశ్రయించింది. జనవరి 30న బెంగళూర్‌కు వెళ్లిన సులేమాన్, అబుబాకర్‌లు అజీం అనే వ్యక్తి వద్ద 10 గ్రాముల కొకైన్, 13 గ్రాముల ఎండీఎంఏ కొనుగోలు చేశారు. ఫిబ్రవరి 2న మిథున్ రెండు గ్రాముల కొకైన్ కావాలని ఆర్డర్ చేసింది. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని మైహోం విహంగ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో మిథున్‌కు రెండు గ్రాముల కొకైన్ అందజేశారు. అప్పటికే మాటు వేసి ఉన్న టీఎస్ న్యాబ్, ఎస్‌వోటీ, గచ్చిబౌలి పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి రూ.26 లక్షల విలువ చేసే 10 గ్రాముల కొకైన్, 13 గ్రాముల ఎండీఎంఏ, స్కోడా, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు సులేమాన్, అర్మన్, అర్కమ్, మిథున్‌లను అరెస్ట్ చేశారు. మిథున్‌తో పాటు డ్రగ్ కొనుగోలు చేసేందుకు వచ్చిన కేపీహెచ్‌బీకి చెందిన కొనగళ్ల ప్రియ, బంజారాహిల్స్‌కు చెందిన డాక్టర్ చల్లా చైతన్యలకు '41' నోటీసులు జారీ చేశారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నారు.

అధిక లాభాల పేరిట కుచ్చుటోపీ

సాక్షి, హైదరాబాద్: అధిక లాభాలు ఆశ చూపించి అమాయకులను మోసం చేస్తున్న ఎక్స్‌ఐటీఓ కన్సల్టెన్సీ సర్వీసెస్ (ఎక్స్‌సీఎస్‌పీఎల్) కంపెనీ డైరెక్టర్ బీఎన్ సతీష్‌ను సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే..బెంగళూరుకు చెందిన సతీష్, అవలకొండప్ప వెంకటచలపతి అనే వ్యక్తితో కలిసి 2015లో బెంగళూరులో ఎక్స్‌సీఎస్‌పీఎల్ పేరుతో కంపెనీ ప్రారంభించారు. ఆ తర్వాత హైదరాబాద్‌కు చెందిన గాదిరాజు రాజేంద్రప్రసాద్ రాజు, గురు ప్రసాద్, పాసం వెంకట్ ప్రసాద్, జ్యోతిలతో కలిసి కేపీహెచ్‌బీలోని మంజీరా ట్రినిటీలో బ్రాంచ్ ఆఫీసును ప్రారంభించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన సుమారు 200 మంది సామన్యుల నుంచి రూ.2 కోట్లు డిపాజిట్లు వసూలు చేశారు. ఆ తర్వాత పరారయ్యారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

అపోలో కేన్సర్ ఆస్పత్రిలో 'విక్టరీ బెల్'



విక్టరీ బెల్ ప్రారంభ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు

బంజారాహిల్స్: అపోలో కేన్సర్ ఆస్పత్రిలో 'విక్టరీ బెల్'ను మంత్రి శ్రీధర్‌బాబు శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ.. కేన్సర్ రోగులు అధైర్యపడొద్దన్నారు. ఆత్మవిశ్వాసమే కొండంత బలమని సూచించారు. అపోలో హాస్పటల్స్ గ్రూప్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతారెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా విక్టరీ బెల్‌ను ఆవిష్కరించడం ముఖ్యమైన ఘట్టంగా అభివర్ణించారు. ఇది ఆస్పత్రిలోని ఆంకాలజీ యూనిట్లలో జరిగిన పోరాటాలకే కాకుండా ప్రతి కేన్సర్ రోగి ప్రయాణాన్ని ఆవిష్కరిస్తుందన్నారు. విజయం, పట్టుదల స్ఫూర్తికి ప్రతీకగా నిలుస్తోందన్నారు. అపోలో కేన్సర్ హాస్పటల్ డైరెక్టర్ విజయ్ ఆనంద్‌రెడ్డి మాట్లాడుతూ... విక్టరీ బెల్ నుంచి వచ్చే శబ్దం కేన్సర్‌ను జయించిన వ్యక్తి విజయాన్ని సూచిస్తుందన్నారు.

8,9 తేదీల్లో ఢిల్లీలో బీసీ సమరభేరి


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్ గౌడ్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ బీసీలకు తీవ్ర నిరాశ మిగిల్చిందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ మండిపడ్డారు. బీసీలపై కేంద్ర తీరును నిరసిస్తూ ఈ నెల 8, 9 తేదీలలో ఢిల్లీలో జరిగే బీసీల సమర భేరి సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం రవీంద్రభారతిలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కె.గణేష్ చారి ఆధ్వర్యంలో బీసీల సమర భేరి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశానికి బీసీ ప్రధాని ఉన్నప్పటికీ బడ్జెట్‌లో తమకు మొండిచేయే మిగిలిందని ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో గౌడ సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బి.బాల్‌రాజ్ గౌడ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె.శ్రీనివాస్, విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు విక్రమ్‌గౌడ్ తదితరులున్నారు.

అమెరికా నుంచి వచ్చి.. యువతిని వేధించి..

కటకటాల పాలైన ఓ కంపెనీ సీఈఓ

వెంగళరావునగర్: తన సంస్థలో విధులు నిర్వహిస్తున్న యువతి కోసం అమెరికా నుంచి వచ్చిన ఓ సీఈఓ..ఆమెను వేధించి కటకటాల పాలైన సంఘటన మధురానగర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..అమీర్‌పేటలో ఉన్న ఇన్ఫోగ్రావిటీ సంస్థ సీఈఓ టి.చంద్ర అమెరికాలో ఉంటాడు. ఇండియాలో తన కంపెనీ అభివృద్ధిలో భాగంగా నిరంతరం జూమ్ సమావేశాలు ఏర్పాటు చేసి ఉద్యోగులకు సలహాలు, సూచనలు ఇస్తుంటాడు. ఈ క్రమంలో తన కంపెనీలో (అమీర్‌పేట సంస్థ)లో హెచ్‌ఆర్‌గా విధులు నిర్వహిస్తున్న యువతిని జూమ్ సమావేశంలో చూశాడు. అంతేగాకుండా ఆమెపై మనసు పారేసుకున్నాడు. తన కంపెనీ అభివృద్ధి కోసం అందమైన అమ్మాయిలకు ఉద్యోగాలు ఇవ్వాలని సూచించడమే కాకుండా ఆమెను నిత్యం పొగిడేవాడు. అయితే అతను తన యజమాని కావడంతో యువతి ఏమీ అనలేక పోయింది. గతేడాది డిసెంబర్‌లో ఇండియాకు వచ్చిన చంద్ర ఆ యువతిని వేధించడం మొదలుపెట్టాడు. తనతో సన్నిహితంగా ఉండాలని ఒత్తిడి చేశాడు. దీంతో విసుగుచెంది అదే నెల 12న ఉద్యోగానికి రాజీనామా చేసింది. తనకు రిలీవింగ్ లెటర్, జీతం, లీగల్ సరీ్వసెస్ డ్యూస్, ఎక్స్‌పీరియన్స్ లెటర్స్ కావాలని కోరింది. అయితే తన కోర్కె తీరిస్తేనే వాటిని ఇస్తానని చంద్ర చెప్పడంతో ఆమె ఆగ్రహించి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కుమారి ఆంటీ హోటల్ రీ ఓపెన్

గచ్చిబౌలి: ఎట్టకేలకు కుమారి ఆంటీ హోటల్ తెరుచుకుంది. ఐటీ కారిడార్‌లో కోహినూర్ హోటల్ ఎదురుగా ట్రాఫిక్ జాం నెలకొనడంతో కుమారి ఆంటీ హోటల్‌ను ఇటీవల రాయదుర్గం ట్రాఫిక్ పోలీసులు తొలగించడంతో వివాదం నెలకొన్న విషయం తెలిసిందే. సోషల్ మీడియాలో కుమారి ఆంటీ హోటల్ తొలగింపు వైరల్ కావడంతో సీఎం కార్యాలయం స్పందించింది. ఈ హోటల్‌ను అదే స్థలంలో నడుపుకోవచ్చని ముఖ్యమంత్రి రేవంత్ అధికారులను ఆదేశించడంతో వివాదానికి తెరపడింది.


భోజనం వడ్డిస్తున్న కుమారి ఆంటీ

జిల్లా వార్తలు


ఎన్‌ఆర్‌ఐ ఫౌండేషన్ సేవలు అభినందనీయం



విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మంసహకారనగర్: దివ్యాంగులకు చేయూతనిస్తున్న ఎన్‌ఆర్‌ఐ ఫౌండేషన్ సేవలు అభినందనీయమని ఖమ్మం జిల్లా కలెక్టర్ వీ.పీ.గౌతమ్ అన్నారు. ఖమ్మంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన 25 మంది దివ్యాంగులకు రూ.3 లక్షల విలువైన వీల్ చైర్స్, బీటెక్ చదువుతున్న పేద విద్యార్థినికి రూ.50 వేల విలువైన ల్యాప్‌టాప్ అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులు, విద్యార్థులు, మహిళలకు ఎన్‌ఆర్‌ఐ ఫౌండేషన్ ఆధ్వర్యాన అండగా నిలుస్తుండడం అభినందనీయమని తెలిపారు. ఎన్నారై ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బయ్యాన బాబురావు, అధ్యక్ష, కార్యదర్శులు బోనాల రామకృష్ణ, బండి నాగేశ్వరరావు, కార్పొరేటర్ మిక్కిలినేని మంజులతో పాటు మిక్కిలినేని నరేంద్రచౌదరి, పసుమర్తి రంగారావు, కొంగర పురుషోత్తమరావు, కురివెళ్ల ప్రవీణ్, అన్నం శ్రీనివాసరావు, వాసిరెడ్డి శ్రీనివాస్, కళ్యాణపు సాంబశివరావు, జ్యోతి, పద్మిని, వాసిరెడ్డి అర్జునరావు, ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జెన్‌కో హాకీ, బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న సీఈ ప్రభాకర్‌రావు

పాల్వంచ: పాల్వంచలోని విద్యుత్ కళాభారతి క్రీడా మైదానంలో కేటీపీఎస్ 5, 6వ దశల స్పోర్ట్స్ కౌన్సిల్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న జెన్‌కో ఇంటర్ ప్రాజెక్ట్స్ హాకీ, బాస్కెట్‌బాల్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు కేటీపీఎస్, బీటీపీఎస్, వైటీపీఎస్, జూరాల, విద్యుత్ సౌధ నుండి క్రీడాకారులు పాల్గొన్నారు. ఈమేరకు పోటీలను ప్రారంభించిన సీఈ ఎం.ప్రభాకర్‌రావు మాట్లాడుతూ ఉద్యోగులు విధినిర్వహణతో పాటు క్రీడల్లో పాల్గొనడం ద్వారా చురుకుదనం పెరుగుతుందని తెలిపారు. యాజమాన్యం తరుపున క్రీడాకారులకు సహకారం ఉంటుందని చెప్పారు. ఈకార్యక్రమంలో ఎస్‌ఈలు మోక్షవీర్, శ్రీనివాసరావు, రామారావు, జెన్‌కో స్పోర్ట్స్ ఆఫీసర్ లోహిత్ ఆనంద్, స్పోర్ట్స్ సెక్రటరీలు తంబళ్ల వీరస్వామి, వై.వెంకటేశ్వర్లు, నరసింహా, రాజు, కట్టా శ్రీధర్, బరగడ రామారావు, జోలి శ్రీను, రవిబాబు, తోట అనిల్, మహ్మద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక క్షేత్రానికి 'కళ'

- భద్రాద్రిలో నేటి నుంచి అంతర్రాష్ట్ర నాటక పోటీలు
- వివిధ రంగాల్లో కళాకారులకు సత్కారాలు
- 23 ఏళ్లుగా ఆనవాయితీ కొనసాగిస్తున్న 'కళాభారతి'

భద్రాచలంటౌన్: దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాద్రి క్షేత్రం రామయ్య కొలువైన నేలగానే కాకుండా కళలకు కాణాచిగానూ నిలుస్తోంది. భద్రాచలం పేరు వినగానే కళల పండుగకు వేదికగా నిలుస్తున్న 'భద్రాద్రి కళాభారతి' సైతం గుర్తుకొస్తుంది. కళలను ప్రదర్శించడమే కాకుండా తెలుగు రాష్ట్రాల్లోని వివిధ కళారంగాల్లో ప్రముఖులను భద్రాచలం రప్పించి రామయ్య సన్నిధిలో పూజలు చేయించాక అతిథి మర్యాదలతో సత్కరించడం సంప్రదాయంగా వస్తోంది. దీన్ని 'భద్రాద్రి కళాభారతి' నిర్వాహకులు ఆనవాయితీగా కొనసాగిస్తూ అంతరించిన పోతున్న నాటకరంగానికి ఊపిరిలూదుతున్నారు. కళాకారులను నలుగురికి పరిచయం చేస్తూ ఏటా నిర్వహించే ఉత్సవాలు ఆదివారం నుంచి మూడు రోజుల పాటు జరగనున్నాయి.

చిరుద్యోగులతో 'కళాభారతి'

భద్రాచలం ఆర్‌టీసీ డిపో చిరుద్యోగుల మదిలో మెదిలిన ఆలోచనతో భద్రాద్రి కళాభారతి ప్రాణం పోసుకుంది. ఈ సంస్థకు వ్యవస్థాపక అధ్యక్షుడిగా ఉన్న అల్లం నాగేశ్వరరావు స్వతహాగా కళాకారుడు, దీంతో సహద్యోగులు, కళాకారులైన నర్సింహారావు, రామరాజు శ్రీనివాస్, ప్రతాప్, తిరుపతి, పులిరాజుతో కలిసి నాటిక, నాటక రంగాల్లో కళాకారులను తీర్చిదిద్దాలని, ఆ రంగానికి మరింత ప్రాచుర్యం తీసుకురావాలని 2001 ఆగస్టు 21న భద్రాద్రి కళాభారతిని ప్రారంభించారు. అప్పటి నుంచి ఏటా భద్రాచలంలో పండుగలా నాటకోత్సవాలు నిర్వహిస్తున్నారు. అంచెలంచెలుగా పలువురి ఆర్థిక సహకారంతో 2003 నుంచి అంతర్రాష్ట్ర స్థాయి నాటికల పోటీలు నిర్వహించడం మొదలుపెట్టారు. ఇప్పటి వరకు సుమారు వందకు పైగా నాటికలు ప్రదర్శిమవగా, ఎందరో వర్ధమాన కళాకారులు కళాభారతి ద్వారా వెలుగులోకి రావడం విశేషం. ఈ నాటకోత్సవాలకు తెలుగు రాష్ట్రాల నుంచే కాక ఇతర రాష్ట్రాల కళాకారులు హాజరవుతున్నారు.


అంతర్రాష్ట్ర నాటకోత్సవాల్లో ప్రదర్శన ఇస్తున్న కళాకారులు (ఫైల్)

కళాకారులకు సత్కారం

కేవలం నాటికల ప్రదర్శనకే పరిమితం కాకుండా జానపద, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు, మిమిక్రీ, ఇంద్రజాలం వంటి ప్రదర్శనలు ఇప్పిస్తూ ఆయా రంగాల కళాకారులు, సినీ, టీవీ నటులను ఘనంగా సత్కరిస్తున్నారు. కళాతపస్వి కె.విశ్వనాథ్, సుద్దాల అశోక్‌తేజ, నూతనప్రసాద్, ఎల్‌బీ.శ్రీరాం, తనికెళ్ల భరణి, గుండు హనుమంతురావు, చంద్రబోస్, జయప్రకాష్ రెడ్డి, ఘంటాడి కృష్ణ, తెలంగాణ శకుంతల, శివశంకర్ మాస్టారు, ఏవీఎస్, గోరేటి వెంకన్న, జయరాజు, మధుప్రియ, హీరో శ్రీకాంత్, దేశపతి శ్రీనివాస్, ఆర్.నారాయణమూర్తి, రేలంగి శ్రీనివాసరావు తదితరులు ఎందరో ఈ వేదికపై సత్కారం అందుకున్నారు.

నేటి నుంచి మూడు రోజుల పండుగ

భద్రాచలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఆదివారం నుంచి మూడు రోజుల పాటు కళల పండుగ జరగనుంది. ఈ మూడు రోజుల పాటు జిల్లాతో పాటు కరీంనగర్, గుంటూరు, కొలకలూరు తదితర ప్రాంతాల కళాకారుల నాటిక ప్రదర్శనలే కాక శాస్త్రీయ, సాంప్రదాయ నృత్య ప్రదర్శనలు జరగనున్నాయి. అలాగే, సినీ నటుడు పృథ్వీరాజ్, గాయకులు పార్వతి, శంకర్ బాబు తదితరులకు సన్మానించనున్నారు.

నాటక రంగాన్ని కాపాడుకోవాలనే తపనతో..



తెలుగు రాష్ట్రాల్లో నాటక రంగాన్ని కాపాడడం, వర్ధమాన కళాకారులను వెలుగులోకి తీసుకురావాలన్న తపనతో భద్రాద్రి కళాభారతిని స్థాపించాం. అభిమానులు, పట్టణ పుర ప్రముఖుల సహకారంతో పోటీలు నిర్వహిస్తున్నారు. రామయ్య సన్నిధిలో ఈ నాటకోత్సవాలను నిర్వహించే అవకాశం దక్కడాన్ని అదృష్టంగా భావిస్తున్నాం.

– అల్లం నాగేశ్వరరావు, కళాభారతి వ్యవస్థాపక అధ్యక్షుడు

రామయ్యను దర్శించుకున్న ప్రముఖులు


ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న హరీశ్‌రావు

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. తొలుత మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు, ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, మాలోత్ కవిత, తాతా మధు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, మాజీ ఎమ్మెల్యేలు రేగా కాంతారావు, సండ్ర వెంకటవీరయ్య స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం త్రిదండి చిన జీయర్ స్వామి రాగా అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈసందర్భంగా జీయర్‌స్వామి భక్తులకు ప్రసాదం, ఆశీస్సులు అందచేశారు.


భక్తులకు ప్రసాదం పంపిణీ చేస్తున్న చినజీయర్ స్వామి

మామిడితోటల్లో తెగుళ్లు..


సూపర్‌బజార్(కొత్తగూడెం): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి, పాల్వంచ, చుంచుపల్లి, చంద్రుగొండ, సుజాతనగర్, జూలూరుపాడు, అన్నపురెడ్డిపల్లి మండలాల్లో మామిడి తోటలను కొత్తగూడెం కేవీకే శాస్త్రవేత్తలు, ఉద్యాన అధికారులు శనివారం సందర్శించారు. ఈసందర్భంగా తోటలను ఆశించిన తెగుళ్లను గుర్తించి సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. తామర పురుగుల నివారణకు ఫిప్రోనీల్ 2ఎం.ఎల్.ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అలాగే,బూడిద తెగులు నివారణకు నీటిలో కరిగే గంధకం 2గ్రా.ను కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. రైతులు పండు ఈగ నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు. కాగా, ఫ్రూట్ బ్యాగింగ్ చేయడం, కార్బయిడ్ రహితంగా మాగించడం వంటి మేలైన పద్ధతులు, కోత అనంతరం తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో జిల్లా ఉద్యాన పట్టు పరిశ్రమ శాఖాధికారి జినుగు మరియన్న, కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ వి.లక్ష్మీనారాయణమ్మ, శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.నవీన్, డాక్టర్ ఆర్.శ్రీనివాస్, డాక్టర్ బి.శివ తదితరులు పాల్గొన్నారు.


మామిడితోటల పరిశీలనలో అధికారులు, శాస్త్రవేత్తలు

అనర్హత ఉత్తర్వులు రద్దు చేయండి

డీసీఎంఎస్ చైర్మన్ వ్యవహారంపై ట్రిబ్యునల్ ఉత్తర్వులు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం జిల్లా కో–ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్) చైర్మన్ పదవీ వ్యవహారంపై తెలంగాణ కోఆపరేటివ్ ట్రిబ్యునల్ వరంగల్ కోర్టు ఉత్తర్వులు విడుదల చేసింది. వ్యక్తిగత రుణ వ్యవహారంలో డీసీఎంఎస్ చైర్మన్, తల్లాడ మండలం గంగదేవిపాడు పీఏసీఎస్ చైర్మన్ రాయల వెంకటశేషగిరి రావుపై వేసిన అనర్హత వేటు ఉత్తర్వులను రద్దుచేయాలని జిల్లా సహకార అధికారిని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించింది. ఆయన డీసీసీబీ నుంచి రూ. 27 లక్షల మేర వాహన రుణం తీసుకుని బకాయి పడడంతో అధికారులు నోటీసులు జారీ చేశాక కారును జప్తు చేశారు. అనంతరం బకాయి కలిగి ఉండడంతో నిబంధనలకు మేరకు ఆయనను పదవి నుంచి తొలగించి డీసీఎంఎస్ వైస్ చైర్మన్ అయిన కొత్వాల శ్రీనివాసరావుకు చైర్మన్ బాధ్యతలు అప్పగించారు. దీంతో శేషగిరిరావు వరంగల్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించగా అనర్హత ఉత్తర్వులను రద్దు చేయాలని ఆదేశించింది. దీంతో ఆయన శనివారం ఖమ్మం డీసీఎంఎస్ కార్యాలయానికి వచ్చి డైరెక్టర్లు తోళ్ల కోటయ్య, మారుతి యట్టయ్యతో కలిసి విలేకరులతో మాట్లాడారు. తాను అనారోగ్యంతో ఉన్న సమయాన రుణబకాయిలు చెల్లించాలని నోటీసులు ఇవ్వడమే కాక జప్తు చేశారని తెలిపారు. ఆ వెంటనే తాను బకాయి చెల్లించినా పదవుల నుంచి తొలగించడంతో ట్రిబ్యునల్‌ను ఆశ్రయించానని పేర్కొన్నారు. ఈమేరకు అనర్హత ఉత్తర్వులను రద్దు చేయాలని డీసీఓను ట్రిబ్యునల్ ఆదేశించిందన్నారు. కాగా, స్వతంత్రంగా వ్యవహరించాల్సిన అధికారులు రాజకీయ నాయకుల మెప్పు కోసం అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆయన ఆరోపించారు.


ట్రిబ్యునల్ ఉత్తర్వులను చూపిస్తున్న రాయల శేషగిరిరావు

పూర్తి వివరాలు కోర్టుకు సమర్పిస్తాం...

డీసీఎంఎస్ చైర్మన్, గంగదేవిపాడు పీఏసీఎస్ చైర్మన్ రాయల శేషగిరిరావు రుణ బకాయి ఉండడంతో చట్టప్రకారం అనర్హత వేటు వేశామని ఖమ్మం జిల్లా సహకార అధికారి ఏ.విజయకుమారి తెలిపారు. దీంతో ఆయన హైకోర్టును, ఆతర్వాత వరంగల్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారని పేర్కొన్నారు. కోర్టు ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా ఈనెల 7న కౌంటర్ ఫైలు దాఖలు చేస్తామని తెలిపారు. ఇదేవిషయమై చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు మాట్లాడుతూ పదవులు కోల్పోయిన శేషగిరిరావు అధికారికంగా ఆదేశాలు రాకముందే చైర్మన్ కుర్చీలో కూర్చోవడం చట్టాన్ని ఉల్లంఘించటమేనని తెలిపారు.

5న కొత్తగూడెంలో రెజ్లింగ్ పోటీలు

కొత్తగూడెంటౌన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఈనెల 5న జిల్లాస్థాయి రెజ్లింగ్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నారు. కొత్తగూడెం త్రీఇంక్‌లైన్ పరిధిలోని తెలంగాణ క్రీడా మైదానంలో ఈ పోటీలు జరుగుతాయని అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.కాశీహుస్సేన్ తెలిపారు. ఈ పోటీలు అండర్–12, 15, 17 విభాగాల్లో జరగనుండగా, బాలబాలికలు ఆధార్‌కార్డులో ఉదయం 9గంటల లోపు రిపోర్టు చేయాలని సూచించారు. వివరాల కోసం 83095 29743 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.